**కథ**

# గుణపాఠం

## భరణి

కౌశాంబి నగరంలో ధూమకేతు అని ఒక యోధుడు నివసిస్తుండేవాడు. అతని భార్య మంచి రూపసి. ఐతేనేం - ధూమకేతు మాత్రం పరస్త్రీల కోసం ప్రాకులాడుతూనే ఉండేవాడు.

అతని ఇంట్లోనే ఒక దాసి ఉంది. ఆమె అందగత్తె గాక పోయినా, ధూమకేతుకు ఆమెలో ఏదో అనిర్వచనీయమైన ఆకర్షణ అగుపించింది. ఆమెను పొందాలని ఎన్నో సార్లు ప్రయత్నించి విఫలుడైయాడు. ఆమె కూడా తన ఇంట్లోనే ఒక గదిలో నివసించేది. తన భార్య కంట పడకుండా చాలాసార్లు ఎన్నో విధాల ఆశజూపి వశపరచుకోజూశాడు. దాసి అందుకు సమ్మతించక పోగా -

"ఈసారి ఇలా అసభ్యంగా ప్రవర్తించారంటే, అమ్మగారికి ఫిర్యాదు చేయటం ఖాయం" అని బెదిరించేది. ఆ రోజుకు ఊరుకుని, మళ్లా అదను చూసుకుని వెకిలి చేష్టలతో ఆమెను ఆకర్షించటానికి ప్రయత్నించేవాడు.

ఇక ఈ బాధను ఓపిక నశించి, యజమానురాలితో ఒకరోజు తన యజమాని అసభ్య ప్రవర్తన గురించి చెప్పేసింది. ఆ యజమానురాలు ఇది వినగానే కోపం వచ్చినప్పటికీ తమాయించుకుని, తన భర్తకు చక్కటి గుణపాఠం నేర్పాలని నిర్ణయించుకుంది. ఆలోచించి ఒక పథకం వేసింది. దాసితో "ఈ సారి ఆయన నీతో యిదేవిధంగా ప్రవర్తిస్తే, రాత్రికి నీ గదిలోకి రమ్మని ఆహ్వానించు. తర్వాత సంగతి నేను చూసుకుంటాను." అంది.

దాసి యజమానురాలు చెప్పినట్టే చేయటానికి నిశ్చయించుకుంది.

మర్నాడుకూడ ధూమకేతు దాసి ముందు వెకిలి చేష్టలు దాసి సమాధానంగా నవ్వింది. ధూమకేతు ఆశ్చర్యపోయాడు.

సంతోషం పట్టలేక ఉక్కిరి బిక్కిరి అయాడు. చివరకు తన పథకం పారుతున్నందుకు ఉప్పొంగి పోయాడు.

దగ్గరగా వెళ్లి ఆమెతో తన కోరిక బయటపెట్టాడు.

"రాత్రికి నా గదికి రండి" అంది దాసి తలదించుకుని, కాలి బొటన వేలితో నేలమీద రాస్తూ.

ధూమకేతు ఈ సమాధానికి నిజంగానే గొప్పవరం పొందిన భక్తుడిలా పట్టరాని సంతోషంతో, తన భార్య నిద్రపోగానే, ఆమె గదికి వస్తానని చెప్పాడు. నాటి సాయంత్రం అనుకోకుండా ధూమకేతు ఆప్త మిత్రుడు ఒకడు దేశాటన చేసి తిరిగి వస్తూ ధూమకేతు ఇంట బసచేశాడు. తన మిత్రుడు రాకరాక వచ్చినందుకు ఒకవైపు సంతోషించినా, మరోవైపు రాత్రి తను అనుకున్నట్టు దాసిని కలుసుకోవటం వీలుపడదేమోనని విచారించాడు ధూమకేతు.

రాత్రి ధూమకేతు, అతని మిత్రుడూ భోజనం చేసి ఆరుబయట తమలపాకులు వేసుకుంటూ వెన్నెల్లో కూర్చున్నారు. కొంతసేపు పిచ్చాపాటి మాట్లాడుకున్నాక ధూమకేతుతో అతని మిత్రుడు తనకు గల రహస్యమైన కోరికను బయట పెట్టాడు.

"దేశాటనానికై బయల్దేరిన తర్వాత ఆడదాన్ని కన్నెత్తి అయినా చూడలేదు. చాలా రోజుల తర్వాత మళ్లా కోరిక కలుగుతూంది. ఈ వూళ్లో ఎక్కడైనా అవకాశం వుంటే - నాకు సాయంచేసి పుణ్యం కట్టుకో" అన్నాడు బతిమాలేలా.

ధూమకేతుకు తన మిత్రుడి సంగతి తెలుసు. అందుకని అతని కోర్కె విపరీతమైనదిగా తోచలేదు. కాని అప్పటికప్పుడు తన మిత్రుడికి సహాయం చేసే మార్గం ఎంత ఆలోచించినా తట్టలేదు. ఆలోచించగా ఒక భేషైన ఆలోచన వచ్చింది. ఆ విధంగా చేస్తే తన కోరిక కూడ నిరాఘాటంగా నెరవేరుతుందని ఆలోచించి మిత్రుడితో, "మా ఇంట్లో దాసిదాన్ని చూశావు కదూ! దాన్ని వలలో వేసుకోవాలని చాల రోజులుగా ప్రయత్నించాను. ఇన్నాళ్లకు, ఇవాళ నా కోరిక తీర్చటానికి ఒప్పుకుంది. ఇంతలో నువ్వు వచ్చావు. మిత్రుడిగా నీ కోరిక మన్నించటం నాధర్మం. ఇద్దరికీ ఉపయోగపడే మార్గం ఒకటి చెవుతాను. నేను ముందు కాస్సేపు ఇచ్చకాలాడి వస్తాను. తర్వాత నువ్వామెకు అనుమానం కలగకుండా వెళ్లి రావచ్చు." అన్నాడు.

ఈ ఉపాయం మిత్రుడికి కూడ నచ్చింది.

ఇంటిలోపల ఎక్కడో వున్న యజమానురాలు గాని, దాసిగాని ఈ సంభాషణ వినలేక పోయారు.

తను మొదట వేసుకున్న పథకం ప్రకారం యజమానురాలు దాసిని తన మంచంపై పడుకోమని చెప్పి, తాను దాసి గదిలో పడుకుంది.

రాత్రి చాలా పొద్దుపోయాక, ధూమకేతు దాసి గదిలోకి మెల్లగా ప్రవేశించాడు.

గది అంతా చీకటిగా వుంది. వెన్నెల కొద్దిగా కిటికీలోంచి లోపలికి పడుతుండటం వల్ల మంచం ఎటువేపు ఉందో చూడగలిగాడు. కాని, మంచం మీద పడుకున్నది దాసి అన్న భ్రమలోనే ఉన్నాడు.

మెల్లగా మంచం మీద ఆమెను చేరుకున్నాడు. అంతులేని ఆనందాన్ని అనుభవించాడు. అంత తృప్తితో ఎన్నడూ తన భార్యతో మసలి ఉండడు. ఆమె కూడా తన భర్త ఇంతటి రసజ్ఞుడని అప్పుడు కాని తెలుసుకోలేకపోయింది. తీయని బాధ అనుభవిస్తూ క్రమంగా నిద్రలోకి జారుకుంది.

కొంతసేపటికి తేలికపడ్డ శరీరంతో బయటికి వచ్చాడు ధూమకేతు, అతని రాక కోసం అతని మిత్రుడు ఆకలిగొన్న పులిలా ఆరుబయటపడుకుని ఎదురు చూస్తున్నాడు.

ధూమకేతు సౌజ్ఞ చేయగానే అతని మిత్రుడు వడివడిగా దాసి గదిలోకి వెళ్లాడు. చప్పుడు చేయకుండా ఆమెను సమీపించాడు.

యజమానురాలు తన భర్తే తన సరసన పడుకున్నాడని అనుకుని తృప్తిగా ఊరుకుంది. తీయటి ఆ బాధకు ఆమె కొంత సేపటికి మళ్లా నిద్రలోకి జారుకుంది.

ఆ మిత్రుడు సంతృప్తిగా లేచి




బయటకు వచ్చి, ఎమీ ఎరగని వాడిలా ఆరు బయట మంచం మీద పడుకుని హాయిగా నిద్రపోయాడు.

కాని, ధూమకేతుకు తనివితీరలేదు. ఈ రోజు తను తృప్తిగా దానిదాన్ని అనుభవించక పోతే, మళ్లా అవకాశం రాకపోవచ్చు. ఇలా ఆలోచించి దాసిగదిలోకి మరోసారి దూరాడు.

యజమానురాలి నిద్రకు భంగం కలిగింది.

తన భర్త ఇంతసేపు తనతో గడపటం ఆమెకు ఆశ్చర్యమేవేసింది. ఇంత పురుషత్వం గల తన భర్త ఆ దానికి దాసోహం అనటమా! తను దాసి అన్న భ్రమలోనే ఇంతసేపు ఉన్నట్టుంది. తానతని భార్యేనని తెలిసి ఉన్నట్టయితే, మొదటి సారే అంతసేపు ఉండేవాడు కాదు. ఇలా ఆమె ఆలోచిస్తూండగానే తెలతెలవారసాగింది.

ధూమకేతు హఠాత్తుగా 'పక్కమీద నుంచి లేచాడు. తెల్లవారేలోపు తన భార్య గదికి వెళ్లటం మంచిదనుకుని, చివరసారిగా దాసి ముఖాన్ని ముద్దు పెట్టుకోవాలని తన వైపుకు ఆమె మొహాన్ని తిప్పుకున్నాడు.

అంతే!

ధూమకేతు ముఖం వివర్ణమై పోయింది. అతని భార్య ముఖం జేవు రించింది. నోటికి వచ్చినట్టు భర్తని శాపనార్థాలు పెట్టింది.

"ఆ దాని దానికంటే నేనేం తీసిపోయాను? అదే ఇక్కడ పడుకుందను కుని, తెరిపి లేకుండా - ఛీ!" ఇలా తిట్టిపోసింది.

ధూమకేతు సమాధానం చెప్పలేదు. తను ఆమెతో ఏమని చెప్పగలడు? తనతోపాటు తన మిత్రుడు కూడా ఆమె సరసన పడుకున్నాడని చెప్పగలడా?

చివరికి భార్యతో -

"నాకు నువ్వు మంచి గుణపాఠం నేర్పావు. ఇక నాజన్మలో మరో ఆడదాని కోసం ప్రాకులాడను. నన్ను నమ్ము. ఒట్టేసి చెపుతున్నాను. నన్ను మోసగించిన ఆ దాసీదాన్ని ఇంట్లోంచి తరిమేస్తాను. అది ఇంట్లో ఉండటానికి వీల్లేదు" అన్నాడు.

యజమానురాలు తన భర్తలో వచ్చిన మార్పుకు చాలా సంతోషించింది. అయితే తన తప్పు ఏదీ లేకపోయినప్పటికీ దాసి ఆ ఇంటి నుంచి వెళ్లగొట్టబడింది.

జరిగిన తప్పుకు సిగ్గుపడిపోయిన ఆ మిత్రుడు నాటి మధ్యాహ్నమే మూటా, ముల్లె సర్దుకుని వెళ్లిపోయాడు.

ధూమకేతు ఈ విషయం భార్యతో మరెప్పుడూ మళ్లా ప్రస్తావించలేదు. కాని, ఆ సంఘటన మాత్రం ధూమకేతుకు మంచి గుణపాఠాన్ని నేర్పింది. Ⓜ